సాక్షి
గుంటూరు

ఆదివారం | 3 | సెప్టెంబర్ | 2023



దుర్గమ్మకు వెండి పాదాలు, హస్తాలు

ఇంద్రకీలాద్రి: ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మకు గుంటూరుకు చెందిన దవులూరు వెంకట మనోజ్ కుటుంబం శనివారం వెండి పాదాలు, హస్తాలను కానుకగా సమర్పించారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్: కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శనివారం 3711 క్యూసెక్కులు విడుదల చేశారు. బ్యాంక్ కెనాల్‌కు 759 విడుదల చేశారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 523.50 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ఎస్‌ఎల్‌బీసీకి 450 క్యూసెక్కులు విడుదలవుతోంది.

న్యూస్‌రీల్

5న జిల్లాస్థాయి ఉపాధ్యాయ దినోత్సవం

గుంటూరు ఎడ్యుకేషన్ : మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఈనెల 5వ తేదీ ఉదయం 10 గంటలకు గుంటూరులోని శ్రీ వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జిల్లాస్థాయి ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తూ విధి నిర్వహణలో ఉత్తమ సేవలందిస్తున్న ఉపాధ్యాయులను ఎంపిక చేసి పురస్కారాలతో సత్కరించనున్నట్లు పేర్కొన్నారు.

పల్నాడు జిల్లా దూరవిద్య అడ్మిషన్ల స్పెషల్ డ్రైవ్



వినుకొండ(నూజెండ్ల) : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నందు పల్నాడు జిల్లా దూరవిద్య అడ్మిషన్ల స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా దూరవిద్య ఏసీడీసీ కె.ఎండీ. హుస్సేన్, ఏఐ కోఆర్డినేటర్లు కేవీ సుబ్బారెడ్డి, యు.వెంకటేశ్వరరావు, పి. ప్రభాకరరావు తదితరులు పాల్గొని మాట్లాడుతూ చదువు మళ్లీ కొనసాగిద్దాం, బంగారు భవిష్యత్ నిర్మించుకుందాం అని తెలిపారు. 10వ తరగతి, ఇంటర్ చదవాలనుకునే వారు కళాశాలలో సంప్రదించాలన్నారు. 14 సంవత్సరాలు నిండిన మహిళలు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, వ్యాపారులు, సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

రొంపిచర్లలో కలెక్టర్ శివశంకర్ పర్యటన



రొంపిచర్ల: మండలంలోని విప్పర్లపల్లి, వడ్ల మూడివారిపాలెం, మునమాక గ్రామాల్లో జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి శనివారం పర్యటించారు. ఈ గ్రామాల్లో బూత్ లెవెల్ అధికారులు పరిశీలించి తొలగించిన ఓటర్ల జాబితాలపై పరిశీలన చేశారు. తొలగించిన ఓటర్లను క్షేత్రస్థాయిలో స్వయంగా కలిసి వివరాలు సేకరించారు. అనంతరం మండల కేంద్రమైన రొంపిచర్లలోని తహసీల్దార్ కార్యాలయంలో బూత్ లెవెల్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఓట్ల తొలగింపుపై వివరంగా విశదీకరించారు. ఫారమ్–7 పై బూత్ లెవెల్ అధికారులు నిర్వహించిన ఎంక్వైరీ రిపోర్ట్‌లను నిశితంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి షేషిరెడ్డి, ప్రత్యేక అధికారి శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్ అంజారావు, ప్రత్యేక అధికారి శ్రీనివాసులు, ఆర్‌ఐ సుబ్బారావు, సీనియర్ అసిస్టెంట్ చంద్రశేఖర్‌రావు, ఆయా బూత్ లెవెల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వరలక్ష్మి వ్రతానికి నేటి నుంచి దరఖాస్తుల జారీ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో ఈ నెల ఎనిమిదో తేదీన నిర్వహించే ఉచిత సామూహిక వరలక్ష్మి వ్రతాలకు ఆదివారం నుంచి దరఖాస్తులు జారీ చేస్తామని ఈఓ భ్రమరాంబ తెలిపారు. మధ్యాహ్నాం నుంచి మహా మండపం నాల్గో అంతస్తులోని ఫెస్టివల్ విభాగంలో ఈ దరఖాస్తులు లభిస్తాయని పేర్కొన్నారు. భక్తులు దరఖాస్తులకు తమ ఆధార్ కార్డు జిరాక్స్ కాపీ జత చేసి ఆలయ అధికారులకు అందజేయాలని సూచించారు. మహా మండపం ఆరో అంతస్తులో ఉత్సవమూర్తి వద్ద ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు నిర్వహించే ఉచిత సామూహిక వరలక్ష్మి వ్రతాల్లో 500మందిని అనుమతిస్తామన్నారు.

మనసంతా మహానేత



గుంటూరులోని ఎమ్మెల్సీ కార్యాలయంలో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ అప్పిరెడ్డి, ఎమ్మెల్యే మద్దాళి గిరి, మేయర్ మనోహరనాయుడు, డెప్యూటీ మేయర్ సజిల, యార్డు చైర్మన్ రాజనారాయణ



చిలకలూరిపేట భాస్కర్‌సెంటర్‌లో డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం ప్రజలకు అభివాదం చేస్తున్న వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని

వైఎస్సార్‌కు ఘన నివాళులు

- జిల్లా వ్యాప్తంగా సేవా కార్యక్రమాలు
- గుంటూరులో వైద్య శిబిరం ఏర్పాటు
- వందలాది మందికి వైద్య పరీక్షలు

సాక్షి ప్రతినిధి,గుంటూరు: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి శనివారం జిల్లా వ్యాప్తంగా జరిగింది. జిల్లాలోని ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలుచోట్ల వైఎస్సార్ చిత్రపటాలకు క్షీరాభిషేకాలు నిర్వహించారు. వైద్యశిబిరాలు ఏర్పాటు చేశారు.

- గుంటూరు నగరంలోని బృందావన్ గార్డెన్స్‌లో ఉన్న జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు డొక్కా మాణిక్యవరప్రసాద్, ఎమ్మెల్సీలు మర్రి రాజశేఖర్, చంద్రగిరి ఏసురత్నం, ఎమ్మెల్యేలు మద్దాళి గిరిధర్, షేక్ మొహమ్మద్‌ముస్తఫా, మేయర్ కావటి మనోహర్ నాయుడు, పార్టీ సీఈసీ సభ్యులు తాడిశెట్టి మురళీమోహన్, జిల్లా ప్రధానకార్యదర్శి షేక్ నూరి ఫాతిమాలు పాల్గొని వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 200 మంది పేదలకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. డాక్టర్లు వై.షేక్, డాక్టర్ షావలి, డాక్టర్ శివరామిరెడ్డి, డాక్టర్ బాలకృష్ణ, డాక్టర్ కోటేశ్వరరావు, డాక్టర్ హరీష్, డాక్టర్ లక్ష్మీనారాయణరెడ్డి, మువ్వ సురేంద్రనాథ్‌రెడ్డిలు వైద్య సేవలను అందించారు.
- బృందావన్ గార్డెన్స్‌లోని ఎమ్మెల్సీ కార్యాలయంలో శనివారం వైఎస్సార్ వర్ధంతిని పురస్కరించుకుని వైఎస్సార్ చిత్రపటానికి ఎమ్మెల్సీ అప్పిరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, మేయర్ కావటి మనోహర్‌నాయుడు, మిర్చియార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, డెప్యూటీ మేయర్ షేక్ సజీల, గుంటూరు అర్బన్ బ్యాంకు డైరెక్టర్ బందా రవీంద్రనాథ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్, కార్పొరేటర్లు పాల్గొన్నారు.
- మంగళగిరిలో ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే), ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ మునగాల భాగ్యలక్ష్మి, ఆప్కో మాజీ చైర్మన్ గంజి చిరంజీవి, నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలసి వైఎస్సార్ విగ్రహాలకు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అత్మకూరులో వైఎస్సార్ విగ్రహాన్ని ఆవిష్కరించారు.
- పొన్నూరు నియోజకవర్గం పెదకాకానిలో ఎమ్మెల్యే కిలారు వెంకట రోశయ్య నేతృత్వంలో దివంగత మహానేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ర్యాలీ నిర్వహించి ఐలాండ్ సెంటర్‌లోని వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం నిడుబ్రోలు ప్రభుత్వ వైద్యశాలలోని రోగులకు, పలు అనాధ ఆశ్రమాలలో పండ్లు పంపిణీ చేశారు.
- తెనాలిలో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా మండలంలోని తూములూరు గ్రామ ప్రధాన కూడలిలో జరిగిన కార్యక్రమంలో పాల్గొని వైఎస్సార్‌కు నివాళులర్పించారు. వైఎస్సార్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే మర్రెడ్డి శివరామకృష్ణారెడ్డితో కలసి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు.
- ప్రత్తిపాడులో వై.ఎస్.రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా మచిలీపట్టణం పోర్టు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ మేకతోటి దయాసాగర్ అమరావతి రోడ్‌లోని ఐడీ హాస్పిటల్‌లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గుంటూరు రూరల్ మండల వైఎస్సార్ సీపీ నాయకులు, వివిధ గ్రామ నాయకులు పాల్గొన్నారు.
- తాడికొండ నియోజకవర్గం పరిధిలో పలుచోట్ల డాక్టర్ వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు. ఫిరంగిపురం పంచాయతీ కార్యాలయం, వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ మండల కార్యాలయం వద్ద రాజన్న చిత్రపటానికి పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్, నియోజకవర్గ పరిశీలకుడు బి.బ్రహ్మానందరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు డి.కత్తిరేణమ్మలు పూలమాలలు వేసి నివాళులర్పించారు.



అన్నదానం చేస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు డొక్కా



సత్తెనపల్లిలో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి అంబటి రాంబాబు

వృత్తిదారులకు పీఎం విశ్వకర్మ యోజన ఉపయోగకరం

కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి

గుంటూరువెస్ట్: ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకంతో 18 రకాల సంప్రదాయ కుల, చేతి వృత్తిదారులకు ఉపయోగంగా ఉంటుందని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకం ఈనెల 17 నుంచి ప్రారంభమవుతుందన్నారు. చెప్పులు కుట్టుకునే వారు, కుమ్మర్లు, బట్టలు నేసేవారు, తాపీపని, బొమ్మలు తయారీ, బుట్టలు, చాపలు, చీపుర్లు తయారు చేసే వారు ఈ పథకం కిందకి వస్తారన్నారు. 5 నుంచి 7 రోజులు బేసిక్ శిక్షణనిచ్చి గుర్తింపు కార్డు, సర్టిఫికెట్ ఇస్తామన్నారు. తొలి విడత రుణం రూ.లక్ష 18 నెలల రీపేమెంట్, రెండో విడత రూ.2 లక్షలు 30 నెలలు రీపేమెంట్, ఈ మొత్తానికి ఏడాదికి 5 శాతం మాత్రమే వడ్డీ ఉంటుందని చెప్పారు. 18 ఏళ్లు నిండిన వారు, హస్త కళాకారులు, కుటుంబంలో ఒక్కరికి మాత్రమే అర్హత. రిజిస్ట్రేషన్ల కోసం దగ్గర్లోని సీఎస్సీ సెంటర్‌ను సంప్రదించవచ్చన్నారు.

'ఆడుదాం ఆంధ్ర'కు అందరి సహకారం కావాలి

జాయింట్ కలెక్టర్ రాజకుమారి



గుంటూరువెస్ట్: రాష్ట్ర ప్రభుత్వం క్రీడల్ని ప్రోత్సహించే కార్యక్రమంలో భాగంగా అక్టోబర్ 2 నుంచి నవంబర్ 8 వరకు సచివాలయ స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు జరగనున్న ఆడుదాం ఆంధ్ర కార్యక్రమానికి అందరి సహకారం అవసరమని జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి అన్నారు. శనివారం స్థానిక ఉర్దూ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో జేసీ మాట్లాడుతూ 17 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరూ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులన్నారు. క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్, కబడ్డీ, ఖో–ఖో క్రీడా విభాగాల్లో పోటీలు నిర్వహిస్తామన్నారు. ప్రతి స్థాయిలోనూ వ్యాయామ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు, అధికారులు, క్రీడా శిక్షకులు సమన్వయంతో పనిచేయాలన్నారు. సమావేశంలో డీఈఓ శైలజ, స్టెప్ సీఈఓ పల్లవి, డీఎస్‌ఏ చీఫ్ కోచ్ జి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వెండితెరపై సురభి ప్రభావతి

నటజీవితాన్ని మలుపుతిప్పిన 'మిడిల్‌క్లాస్ మెలోడీస్'

- రెండున్నరేళ్లలో నటించినవి పాతిక సినిమాలు
- ప్రముఖ సినీ నిర్మాణ సంస్థలతో జత

తెనాలి: 'సురభి' ప్రభావతి...సినిమాల్లో క్యారెక్టర్ నటిగా దూసుకుపోతున్న పేరు. నాటక కళకు అంకితమైన సురభి సంస్థ వారసురాలైన ప్రభావతి, పెళ్లయ్యాక జీవనం కోసమని రంగస్థలంపైకి వచ్చారు. అక్కడ జైత్రయాత్ర సాగిస్తూ రెండు దశాబ్దాల కాలంలో రెండు వేల నాటక/నాటిక ప్రదర్శనలిచ్చారు. ఐదు నందులతో సహా వందలాది అవార్డులు స్వీకరించారు. ఒకే ఒక్క సినిమాతో ఆమె సినిమా రంగంలో స్థిరపడిపోయారు. రెండున్నరేళ్లలో పాతిక సినిమాలు చేశారు. ప్రముఖ నిర్మాణ సంస్థల్లోనూ నటిస్తూ వెండితెర బిజీ క్యారెక్టర్ నటిగా గుర్తింపు పొందారు.

కరోనా సమయంలో ఓటీటీలో రిలీజై విజయం అందుకున్న చిత్రం 'మిడిల్‌క్లాస్ మెలోడీస్'. ఆ సినిమాలో హీరో తల్లిదండ్రులుగా నటించిన రంగస్థల కళాకారులు ప్రభావతి, గోపరాజు రమణకు అదే సినిమా టర్నింగ్ పాయింట్. రమణ ఇప్పటికే 45 సినిమాల్లో నటిస్తే, ప్రభావతి 25 సినిమాలు చేశారు. ఇద్దరూ కొన్ని సినిమాల్లోనూ కలిసి నటించారు. వీరిద్దరూ తెనాలి మండలం కొలకలూరులోని శ్రీసాయి ఆర్ట్స్ నాటక సమాజం కళాకారులే. ఎనిమిదేళ్లుగా ప్రభావతి శ్రీసాయి ఆర్ట్స్ సమాజంలోనే 500 పైగా ప్రదర్శనల్లో నటించారు. ఆగస్టులో విడుదలైన బెదురులంక సినిమాలోనూ తన నటనకు ప్రశంసలందుకున్న ప్రభావతి నటించిన మరో సినిమా 'అంబాజీపేట బ్యాండ్ పార్టీ' విడుదల కానుంది. ఇప్పుడు రామ్‌గోపాల్‌వర్మ 'వ్యూహం'లో, మహేశ్‌బాబు హీరోగా కొరటాల శివ దర్శకత్వంలో నిర్మిస్తున్న 'గుంటూరు కారం'లో గోపరాజు విజయ్‌కు జోడీగా నటిస్తున్నారు. నార్నె శ్రీనివాసరావు కుమారుడు హీరోగా తీస్తున్న సినిమాలో, ప్రశాంత్‌నీల్ నిర్మాతగా తీస్తున్న 'ఏతి స్వీ'లో నటిస్తున్నారు. ఓటీటీలో రిలీజైన 'ఇంటింటి రామాయణం', 'మెయిల్', 'మేం ఫేమస్'లోనూ నటిగా మంచి గుర్తింపు లభించింది.



వ్యూహం సినిమాలో విజయమ్మ పాత్రలో..

ప్రభావతి తల్లిదండ్రులు రేకందార్ కుమార్‌బాబు, కమలమ్మలు సురభి కళాకారులే. గుణసుందరి నాటకంలో బాలనటిగా చేసినా, రంగస్థల లైటింగ్ నిపుణుడు 'సురభి' నాగేష్‌తో వివాహమయ్యాక నాటకాల్లోకి వచ్చారు. పిన్ని జమునారాయలు తనను 2004లో 'శశిరేఖా పరిణయం'తో బయటి నాటకాలకు పరిచయం చేశారు. లలిత కళాసమితి, కర్నూలు, మయూరి ఆర్ట్స్, కూకట్‌పల్లి, రసరంజని, హైదరాబాద్ సమాజాల్లో నటిస్తూ వచ్చారు. దాదాపు 20 ఏళ్లలో రెండు వేల ప్రదర్శనలిచ్చారు. పద్యనాటకాల్లో సత్యభామ, ప్రమీల, చిత్రాంగద, చిత్రాంగి, దేవదేవి, కుంతి, చారిత్రక నాటకాల్లో రుద్రమదేవి, నాయకురాలు నాగమ్మ, సాంఘికాల్లో మధురవాణిగా గుర్తింపు తెచ్చుకున్నారు.

సురభి కుటుంబంలో జన్మించినా, ఆ సంస్థ చేసిన పద్యనాటకాల్లో ఒక్కటి కూడా నటించకున్నా ఆ సంస్థకు వన్నె తెస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ నంది నాటకోత్సవాల్లో నాలుగుసార్లు ఉత్తమ నటిగా, ఒకసారి ఉత్తమ సహాయనటిగా నంది బహుమతులను స్వీకరించారు. తిరుపతిలో ప్రతిష్ఠాత్మకంగా జరిగే గరుడ పోటీల్లోనూ నాలుగు అవార్డులు లభించాయి. యువకళావాహిని ఉగాది పురస్కారం, తెలుగు యూనివర్సిటీ కీర్తి పురస్కారాన్నీ అందుకున్నారు. పరిషత్ బహుమతులకు కొదవలేదు. ప్రస్తుతం కొలకలూరులోని శ్రీసాయి ఆర్ట్స్ సమాజంతోనే సాంఘిక నాటిక/నాటకాల్లో, కర్నూలు సమాజంలో పద్యనాటకాల్లో నటిస్తున్నారు.

నటరాజు ఆశీర్వదిస్తాడు



'ప్రతి వృత్తిలోనూ ఎవరైనా ప్రమోషన్ ఆశిస్తారు. సినిమా నటి కావాలని ప్రతి కళాకారుడు కష్టపడతారు. అలాంటి కళాకారులను నటరాజు ఆశీర్వదిస్తాడు. ఎందరో కళాకారులను సినిమా అక్కున చేర్చుకుంది. ఇందుకు నా నటజీవితం కూడా ఓ ఉదాహరణ. వెండితెర అవకాశాలతో మంచి నటిగా ప్రేక్షకుల ప్రశంసలు అందుకోవటానికి మించిన సంతృప్తి లేదు. ఆ తపనతోనే కృషిచేస్తున్నాను.

–సురభి ప్రభావతి

ఎస్‌బీలో పలువురికి స్థానచలనం

- ఏడుగురు ఏఎస్‌ఐలు, 8 మంది హెడ్‌కానిస్టేబుళ్ల బదిలీ
- కొందరికి కూతవేటులోని పోలీస్‌స్టేషన్లు కేటాయింపు
- ఇప్పటికే వీఆర్‌లోకి సీఐ, హెచ్‌సీ, కానిస్టేబుల్

నగరంపాలెం: గుంటూరు జిల్లాలోని పలు పోలీస్‌స్టేషన్లలో స్పెషల్ బ్రాంచి(ఎస్‌బీ) సిబ్బంది ఏళ్ల తరబడి తిష్టవేసి, విధులు నిర్వహిస్తున్నారు. వీరిలో పలువురు ఏఎస్‌ఐలు, హెడ్ కానిస్టేబుళ్ల (హెచ్‌సీ)కు స్థానచలనం కలిగించారు. ఇటీవల గుంటూరు ఎస్‌బీపై వస్తున్న అవినీతి, ఆరోపణల దృష్ట్యా 15 మందిని వివిధ పోలీస్‌స్టేషన్లకు బదిలీ చేశారు. ఈ మేరకు జిల్లా ఎస్‌బీ నుంచి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. అయితే కొంతమందిని కూతవేటు దూరంలోని పీఎస్‌లకు బదిలీ చేయడం గమనార్హం. అవినీతి ఆరోపణల దృష్ట్యా గతనెల తొలి వారంలో గుంటూరు జిల్లా ఎస్‌బీ సీఐ–1 బి.నరసింహారావు, హెడ్ కానిస్టేబుల్ (పాత రైటర్), కానిస్టేబుల్‌ను వీఆర్‌కు పంపించగా, డీఎస్పీపై విచారణ చేపట్టిన విషయం విదితమే. ఎస్‌బీ అక్రమాలను నిగ్గుతేల్చేందుకు గుంటూరు ఏఎస్పీ ఎ.శ్రీనివాసరావు (క్రైం) విచారణాధికారిగా నియమించారు. ఇటీవల విచారణ పర్వం ముగియగా, ఆ విచారణ నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు అప్పగించినట్లు సమాచారం. ఈ క్రమంలో జిల్లాలోని పలువురు ఏఎస్‌ఐలు, హెడ్‌కానిస్టేబుళ్లను బదిలీ చేయడం మరింత ప్రాధాన్యత చోటుచేసుకుంది. బదిలీ అయిన వారిలో ఏడుగురు ఏఎస్‌ఐలు, ఎనిమిది మంది హెడ్‌కానిస్టేబుళ్లు ఉన్నారు.

పేరు	ప్రస్తుతం	బదిలీ
ఎస్.వి.బి.సుబ్రమణ్యం (ఏఎస్‌ఐ)	లాలాపేట పీఎస్	నగరంపాలెం పీఎస్
షేక్.అన్వర్ బాషా (ఏఎస్‌ఐ)	పాతగుంటూరు పీఎస్	అరండల్‌పేట పీఎస్
డి.హరినాథ్‌బాబు (ఏఎస్‌ఐ)	అరండల్‌పేట పీఎస్	లాలాపేట పీఎస్
సీహెచ్.శ్రీనివాసరెడ్డి (ఏఎస్‌ఐ)	నగరంపాలెం పీఎస్	పట్టాభిపురం పీఎస్
ఎం.సాంబశివరావు (ఏఎస్‌ఐ)	పట్టాభిపురం పీఎస్	మంగళగిరి టౌన్ పీఎస్
బి.చంద్రశేఖర్ (ఏఎస్‌ఐ)	తాడేపల్లి పీఎస్	సీఐ సెల్
ఎం.నాగేశ్వరరావు (ఏఎస్‌ఐ)	మేడికొండూరు పీఎస్	ప్రత్తిపాడు పీఎస్
ఆర్.సాంబశివరావు (హెచ్‌సీ)	మంగళగిరి టౌన్ పీఎస్	మంగళగిరి రూరల్ పీఎస్
పి.ధనేష్‌కుమార్ (హెచ్‌సీ)	మంగళగిరి రూరల్ పీఎస్	తాడేపల్లి పీఎస్
షేక్.సుభాని (హెచ్‌సీ)	వట్టిచెరుకూరు పీఎస్/ ప్రత్తిపాడు పీఎస్	వట్టిచెరుకూరు పీఎస్
పి.శ్రీనివాసరావు (హెచ్‌సీ)	పెదనందిపాడు పీఎస్	పెదనందిపాడు పీఎస్/కాకుమాను పీఎస్
ఎస్‌కె.రమేష్‌బాబు(హెచ్‌సీ)	కాకుమాను పీఎస్	మేడికొండూరు పీఎస్
జి.నాగరాజు (హెచ్‌సీ)	తాడికొండ పీఎస్, ఐ/సి పెదకాకాని పీఎస్	తాడికొండ పీఎస్
ఎస్.విజయకుమార్ (హెచ్‌సీ)	సీఐ సెల్– పశ్చిమ	పెదకాకాని పీఎస్
ఎస్‌డి.ఎ.ఎం.బాషా (హెచ్‌సీ)	సీఐ సెల్–తెనాలి	పాతగుంటూరు పీఎస్

నిత్యాన్నదానానికి విరాళం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో నిత్యాన్నదానానికి విజయవాడకు చెందిన భక్తులు రూ.లక్ష విరాళం సమర్పించారు. విజయవాడ కామకోటినగర్‌కు చెందిన హరినాథ్, ప్రభావతి శనివారం దుర్గమ్మ దర్శనానికి వచ్చారు. నిత్యాన్నదానానికి రూ.1,00,116 విరాళాన్ని ఆలయ అధికారులకు అందజేశారు. దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మ వారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం దాతలకు చైర్మన్ రాంబాబు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు. పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.


మంగళగిరిలో దివంగత మహానేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు


ఉద్దండరాయునిపాలెంలో వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న బాపట్ల ఎంపీ నందిగం సురేష్


తూములూరులో పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న తెనాలి ఎమ్మెల్యే శివకుమార్


వెనిగండ్ల సుందరయ్యకాలనీలో డాక్టర్ వైఎస్సార్ విగ్రహాన్ని ఆవిష్కరించి, నివాళులర్పించిన పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య

మహానేత ఆశయాల బాటలో నడవాలి

జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రజారంజక పరిపాలనతో సంక్షేమ ప్రదాతగా నిలిచిన మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశయాలబాటలో అందరూ నడవాలని జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా పేర్కొన్నారు. శనివారం మహానేత డాక్టర్ వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా జెడ్పీ ప్రాంగణంలోని ఆయన విగ్రహానికి హెనీ క్రిస్టినా పూలమాల వేసి, నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో ప్రజల గుండెల్లో నిలిచిన వైఎస్సార్ ఆశయాలను ఆయన తనయుడు సీఎం వైఎస్ జగన్ సాకారం చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ బత్తుల అనురాధ, పొన్నూరు, వట్టిచెరుకూరు, కాకుమాను జెడ్పీటీసీలు కె.రమేష్, వెంకటలక్ష్మి, గుల్జార్‌బేగం, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, జెడ్పీ ఉద్యోగులు పాల్గొన్నారు.


మహానేత వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కత్తెర హెనీ క్రిస్టినా, జెడ్పీటీసీలు, ఉద్యోగులు

గుండెవ్యాధి నిర్ధారణ శిబిరానికి విశేష స్పందన

- డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకానికి మరింత మెరుగులు దిద్ది ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా మార్చిన సీఎం వైఎస్ జగన్
- బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ
- దండమూడి గ్రామంలో జరిగిన శిబిరంలో 124 మందికి పరీక్షలు.. 24 మందికి యాంజియోగ్రామ్ చికిత్సకు ఏర్పాట్లు

పొన్నూరు: రాజన్న మానసపుత్రిక ఆరోగ్యశ్రీ అనే గొప్ప పథకాన్ని సీఎం జగనన్న తన సుపరిపాలనతో మరింత మెరుగులు దిద్ది, ఏకంగా 3257 ప్రొసీజర్లకు వైద్య సేవలందిస్తూ రాష్ట్రాన్ని ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా మార్చారని బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ అన్నారు. శనివారం మహానేత దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా పొన్నూరు మండలం దండమూడి గ్రామంలోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి అంబటి మురళీకృష్ణ ఘన నివాళులర్పించారు. అనంతరం దండమూడిలో 'జగనన్నామ సంక్షేమ సంవత్సరం'లో భాగంగా 'మీ గుండె పదిలం' పేరుతో గుండె వ్యాధి నిర్ధారణ పరీక్ష శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ చరిత్రలో అంతకు ముందు ఎన్నడూ, ఎవరు కనీవినీ ఎరుగని రీతిలో పేదలకు కార్పొరేట్ వైద్యం అందించే ఆరోగ్య శ్రీ పథకాన్ని రూపకల్పన చేసిన వైఎస్ రాజశేఖరరెడ్డి మహోన్నత మానవతావాదిగా చరిత్రలో నిలిచిపోయారన్నారు.


వృద్ధురాలిని శిబిరానికి తీసుకువస్తున్న అంబటి మురళీకృష్ణ

124 మందికి గుండె పరీక్షలు..

దండమూడి గ్రామంలో విజయవాడ మెడ్‌స్టార్ ఆసుపత్రి వారి సహకారంతో నిపుణులైన వైద్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య పరీక్షలకు 124 మంది గ్రామస్తులు గుండె పరీక్షలు చేయించుకోగా వారిలో 24 మందికి యాంజియోగ్రామ్ ఆవశ్యకత ఉందని తేలిందన్నారు. వీరందరినీ దండమూడి గ్రామం నుంచి సోమవారం బజరంగ్ ఫౌండేషన్ ద్వారా ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సులో విజయవాడ ఆసుపత్రికి తరలించి యాంజియోగ్రామ్ తదుపరి చికిత్సలకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. గ్రామాల స్థాయిలో చాలామంది పేద, నిరుపేదలకు ఆరోగ్యశ్రీ పథకం ప్రయోజనాలు సంపూర్ణంగా తెలియక పోవడం కొంత బాధ కలిగిస్తున్న విషయమే అయినప్పటికీ, బజరంగ్ ఈ విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ఆరోగ్యశ్రీ ప్రయోజనాలను ఆచరణాత్మకంగా చేసి చూపెడుతూ ఈ పథకానికి ఆదరణ మరింతగా పెరిగేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు.

ప్రజల హృదయాల్లో చెరగని ముద్రవేసిన మహానేత

రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి

పెదకాకాని: రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమించిన మహనీయుడు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి అని రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి పేర్కొన్నారు. పెదకాకాని గ్రామంలో శనివారం దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వైఎస్సార్ విగ్రహానికి ఎంపీ ఆళ్ల అయోధ్యరామిరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ సంక్షేమ పథకాలతో పేద ప్రజల హృదయాలలో చెరగని ముద్ర వేసిన మహనీయుడు డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి అన్నారు. ఆ మహనీయుడు ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను కొనసాగిస్తూ అభివృద్ధి సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వానికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలన్నారు.


పెదకాకానిలో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ ఆళ్ల అయోధ్యరామిరెడ్డి